క్లుప్తంగా

ఉమారుద్రునికి విశేష పూజలు



పూజలందుకుంటున్న ఉమారుద్రుడు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని గుడివీధిలో నాగావళి నదీ తీరాన వేంచేసిన ఉమారుద్రకోటేశ్వర స్వామివారికి సోమవారం విశేష పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ అందజేత



ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌తో అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతులమీదుగా జాతీయ నాణ్యత ప్రమాణాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్న ఆదివారంపేట యూపీహెచ్‌సీకి ఉత్తమ ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత, క్వాలిటీ ఆఫీసర్లు రవికుమార్, రంజిని తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలుపుదల



ఎరువుల దుకాణంలో విజిలెన్సు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని రణస్థలం మండలం కమ్మసిగడాంలో రెండు ఎరువుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాల అమ్మకాల నిలుపుదలకు సిఫార్సు చేసినట్లు విజిలెన్సు ఎస్పీ బర్ల ప్రసాదరావు పేర్కొన్నారు. కనక మహాలక్ష్మి ట్రేడర్స్, ఆదిత్య ట్రేడర్స్‌లో రికార్డులు సక్రమంగా లేనందున రూ.1,14,510లు విలువ చేసే 4.20 టన్నుల కాంప్లెక్సు ఎరువులు, రూ.31,600లు విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. రాష్ట్ర విజిలెన్సు జనరల్ డైరెక్టర్ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో సంబంధిత విభాగాల అధికారులతో జిల్లాలోని ఐదు చోట్ల, విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో 13 చోట్ల దాడులు చేశామన్నారు.

వేటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

రణస్థలం: మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని జీరుపాలెంలో మత్స్యకారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొరబాటులు, మానవ అక్రమ రవాణా, మందుగుండు సామాగ్రి, మాదకద్రవ్యాల రవాణా, సైబర్ క్రైమ్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటువంటి ఏమైనా సమాచారం ఉంటే వెంటనే 1093, 93929 14712 నంబర్ల సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మైరెన్ ఎస్ఐ జి.హరికృష్ణరావు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది, ఎఫ్‌డీవో గంగాధర్, జీరుపాలెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుది జాబితా విడుదల

శ్రీకాకుళం పాత బస్టాండ్: పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టు భర్తీకి సంబంధించి తుది జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఆగస్టు 10న నిర్వహించిన రాత పరీక్ష, అనుభవ మార్కులు, వచ్చిన అభ్యంతరాల ఆధారంగా సవరించిన జాబితాను 25న విడుదల చేసినట్లు చెప్పారు. అందులోని తొలి 10 మందికి 26న కలెక్టర్ కార్యాలయంలో సర్టిఫికేట్ వెరిఫికేషన్, సీపీటీ పరీక్ష జరుగుతుందని ప్రకటించారు.

డీజేలకు అనుమతి లేదు



కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: రెండో పట్టణ పరిధి కెల్లావీధి, తురాయి వీధి ప్రాంతాల్లో సీఐ పి.ఈశ్వరరావు వినాయకుడి మండపాలను అగ్నిమాపక, విద్యుత్ అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇప్పటికీ ఆన్‌లైన్‌లో అనుమతులు కోసం నమోదు చేసుకోవడంలేదని, డీజేలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని, న్యూసెన్సు చేయరాదని స్పష్టం చేశారు.

జ్వర భద్రం..!

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ఇప్పటికే ప్రబలుతున్న జ్వరాలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచనలు



ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎచ్చెర్ల: ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందువలన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. పరిసరాల్లో కలుషిత నీరు నిల్వ అవ్వడం వలన దోమల బెడద పెరుగుతుంది. దీంతో జ్వరాల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే తాజా ఆహార పదార్థాలను తీసుకోవాలని, వేడి నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఆస్పత్రులకు క్యూ...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో 8 పీహెచ్‌సీలు, ఒక్క సీహెచ్‌సీ ఉన్నాయి. వీటికి ప్రతిరోజూ అనారోగ్యాలతో ప్రజలు క్యూ కడుతున్నారు. అస్పత్రులను ఆశ్రయిస్తున్న వారిలో డయేరియా, జలుబు, దగ్గు, జ్వరం, దురదలతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి.



గ్రామాల్లో వైద్య సేవలను అందిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలం వ్యాధులు ముసిరే కాలం. అందువలన ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇలా చేస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవు. ప్రస్తుతం మారుతున్న చల్లని వాతావరణానికి జలుబు, జ్వరం, దగ్గు, దురదలు వచ్చే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే.

– ఇప్పిలి చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్, ఇప్పిలి

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అపారిశుద్ధ్యం వల్లే రోగాలు ప్రబలుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తినే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. వేడి, చల్లని పదార్థాలు వెంటనే తినవద్దు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినప్పుడు వెంటనే వైద్యులను కలిసి పరీక్షించుకోవాలి.

– డాక్టర్ పాడుగు రమ్యరాగిని, వైద్యాధికారి, పొన్నాడ పీహెచ్‌సీ

అయితే ప్రస్తుతం చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు, సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో దగ్గరలోని ప్రైవేటు అస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించకపోవడంతోనే తమకు ఈ దుస్థితి వచ్చిందని పలువురు రోగులు వాపోతున్నారు. అందువలన ఇప్పటికైనా అవసరమైన చోట సదుపాయాలు మెరుగుపరచాలని, పేదలకు వైద్యం బాగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీపీ మండల్ సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్ కల్పించడంలో బీపీ మండల్ సేవలు మరువలేనివని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అమిరుల్లా భేగ్ అన్నారు. సోమవారం బీపీ మండల్ 107వ జయంతి పురస్కరించుకొని మహాత్మా జ్యోతిరావుఫూలే పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమిరుల్లా భేగ్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలైన బీసీలకు రిజర్వేషన్ కల్పించి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలగ జగదీష్, జాతీయ సలహాదారుడు బాడాన దేవభూషణ్, ఉపాధ్యక్షుడు వంజరాపు రాజులు, రాష్ట్ర కార్యదర్శి కలగ గోపాల్, కాల్ల వెంకటరావు, గుత్తు చిన్నారావు, రౌతు శంకరరావు, తిప్పాన గాంధీ, కె.మంగరాజు, జంజులూరి రామారావు, అలపాన త్రినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టీటీడీసీలో చేపల పెంపకానికి శ్రీకారం

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండల కేంద్రం వద్దనున్న సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో చేపల పెంపకం కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఇక్కడ చేపల పెంపకానికి అనువుగా చేపల పెంపకం తొట్టెను తయారుచేసి అందులో చేపల పిల్లలను వేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), ఉదయ్ ఆక్వా కంపెనీవారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉదయ్ ఆక్వా కంపెనీవారు చేపపిల్లలను అందిస్తారు. వీటిని డీఆర్‌డీఏ సిబ్బంది పెంచితే తిరిగి ఆ కంపెనీ వారే వీరివద్ద కొనుగోలు చేస్తారు. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన చేపల పెంపకం తొట్టెలో వెయ్యి కొరమీన చేప పిల్లలను విడిచిపెట్టారు. 3 నెలలకు ఈ చేప పిల్లలు కేజీ బరువు వరకూ పెరుగుతాయని కంపెనీ సిబ్బంది తెలిపారు. ఇలా పెరిగిన వాటిని టీటీడీసీకు ఆనుకుని ఉన్న చెరువులో వేసి పెంచుతారు. వీటి సైజు బాగా పెరిగిన తర్వాత బయటవారికి, కంపెనీవారికి అమ్మకాలు చేపడతారు.



చేప పిల్లలను విడిచిపెడుతున్న దృశ్యం

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జి.సిగడాం: తుఫాన్ కారణంగా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మహాదేవ్వ సరిత సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. తుఫాన్ కారణంగా గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాల వలన ఎక్కడైనా చెరువులు, వాగుల గట్లు తెగితే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

నగరం.. జలమయం

శ్రీకాకుళం నగరంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జలమయమైంది. నగరంలో చాలా కాలనీల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వినాయక చవితి సమీపిస్తుండడంతో వర్షం వలన వినాయక విగ్రహాల అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా మార్కెట్‌లో వ్యాపారులకు సైతం అమ్మకాలు చేసేందుకు తిప్పలు తప్పలేదు. నీరు నిలిచిపోకుండా కాలనీల్లో పూడికలు తీసినా ఫలితం లేకుండా పోయిందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారతీనగర్, హడ్కోకాలనీ, డీసీసీబీ కాలనీ, సరస్వతీ మహల్ కూడలి, రైతు బజార్ కూడలి, కృష్ణాపార్కు రోడ్డు, పొట్టి శ్రీరాములు కూడలి, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని వాపోయారు. భారతీనగర్ కాలనీలోకి ఆర్ట్స్ కాలేజీ లోపల నుంచి మురుగునీరు రావడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



డీసీసీబీ కాలనీలో...



రైతు బజారు కూడలి వద్ద...



భారతీనగర్‌లో నడిరోడ్డుపై నిలిచిన మురుగు నీరు



హడ్కోకాలనీ ఎలిమెంటరీ స్కూల్ లైన్‌లో నిలిచిన వర్షపు నీరు



సరస్వతీ మహల్ కూడలి వద్ద...

సాంకేతిక విజ్ఞానం ద్వారా అభివృద్ధి



మాట్లాడుతున్న వీసీ రజనీ

ఎచ్చెర్ల: యువతలో అంతర్లీనంగా ఉన్న శక్తిని వెలికితీయడానికి, ప్రతి ఒక్కరిలోనూ ఉండే మానసిక శక్తిని సద్వినియోగం చేసుకునేందుకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని బీఆర్ఏయూ వీసీ కె.ఆర్.రజని సూచించారు. విశ్వ విద్యాలయం మెయిన్ సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించిన హిప్నాటిజం షో – యువశక్తి అనే కార్యక్రమంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. యువతకు తమ భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత ఉండాలని, లక్ష్య సాధనకు అనుగుణంగా కృషి చేయాలన్నారు. హిప్నాటిజం ద్వారా సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకొని అభివృద్ధి సాధించాలన్నారు. ప్రోగ్రెసిస్ సైకాలజిస్ట్స అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ప్రముఖ హిప్నోథెరిపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఉన్న శక్తి సామర్థ్యాలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదన్నారు. మతపరమైన, సామాజిక పరమైన మూఢ విశ్వాసాలు, శాస్త్ర విజ్ఞానం నుంచి మనిషిని దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ సైకలాజికల్ అసెస్‌మెంట్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ జె.ఎల్.సంధ్యారాణి, వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు పటిష్ట భద్రత ఉండాలి

- డీఎస్పీ వివేకానంద



శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో జరగనున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు పటిష్ట భద్రత ఉండేలా చూసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత కమిటీలదేనని డీఎస్పీ సీహెచ్ వివేకానంద సోమవారం స్పష్టం చేశారు. మద్యం తాగి న్యూసెన్సు చేసినా.. పరిసర ప్రాంతాల్లో సంఘ విద్రోహక శక్తులు రెచ్చిపోయినా సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టిందన్నారు. అన్ని రకాల అనుమతులు ఒకేసారి ఉచితంగా పొందేలా విధానం రావడం ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు చేరాక పురపాలక, అగ్నిమాపక, విద్యుత్తు శాఖల సిబ్బంది ఓ బృందంగా ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో ఏర్పడి తనిఖీలకు వస్తారన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఉత్సవ విగ్రహాలను రహదారి మార్గానికి అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. ఒక పక్కగా వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.
- కమిటీ సభ్యులు ఆధార్ మరియు చిరునామాలు, ఫోన్ నంబర్లు, విగ్రహాల ఎత్తు, బరువు, పూజా రోజుల సంఖ్య, వినాయక ఊరేగింపు, నిమజ్జన సమయాలు మరియు రూట్‌మ్యాప్ వివరాలు తెలపాలి.
- నిర్వాహకులు మండపాలు ఉండే ప్రదేశం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన ప్రాంతం, సమయాల్లో మాత్రమే విగ్రహ ఊరేగింపు, నిమజ్జనం చేయాలి. రాత్రి 10 లోపు ముగించాలి. చిన్నపిల్లలు ఉండకుండా చూడాలి.
- మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలి. విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రుళ్లు మండపాల వద్దనే ఉండాలి.
- నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలు, రికార్డ్స్, డ్రైవర్ లైసెన్సు తీసుకోవాలి. మద్యం సేవించి వాహనం నడపరాదు. డ్రైవర్ వద్ద అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలి.
- మండపాల వద్ద గానీ, ఊరేగింపులో గానీ బాణాసంచా వినియోగించరాదు.
- దీపారాధన సమయం లేదా మండపాల దీపాలంకరణలో జీఏ వైర్ వినియోగించరాదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక బస్తాలు, వాటర్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలి. మంటలను ఆర్పేందుకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలి.
- నిమజ్జన సమయంలో అశ్లీల నృత్యాలు గానీ డీజే శబ్దాలు గానీ ఉండరాదు.
- రాజకీయ, మతపరమైన ఇతర వ్యక్తులను రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించకూడదు.
- ప్రతీ మండపానికి ఆ పరిధి పీఎస్ నుంచి ఓ పోలీసు కానిస్టేబుల్‌ను కో-ఆర్డినేటర్‌గా నియమించడం జరుగుతుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులతో ఉన్న విగ్రహాలను పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఉపయోగించరాదు. మట్టి విగ్రహాలు మంచిది.
- హుండీ, విలువైన వస్తువులు రాత్రిపూట మండపంలో ఉంచరాదు.
- విగ్రహం వద్ద పాయింట్ బుక్ మరియు రిజిస్టర్ ఉండాలి. మండపం వద్ద కాపలాగా ఉన్న కమిటీ సభ్యుల వివరాలు అందులో పొందుపర్చాలి.

గోతులు పూడ్చివేత

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తీసిన గోతులను పూడ్చకపోవడంతో 'గోతులు తీశారు.. పూడ్చడం మరిచారు' అనే శీర్షికతో ఈనెల 22వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తీసిన గోతులను యుద్ధ ప్రాతిపదికన సోమవారం జేసీబీతో పూడ్చడం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



జేసీబీతో గోతులు పూడ్చుతున్న దృశ్యం

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఆద్యాంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్ సమీపంలో ఉన్న శ్రీఫంక్షన్ హాల్ వేదికగా సోమవారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ అండర్ -17 బాలబాలికల పోటీలను నిర్వహించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఈ పోటీలను ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్(రాజా) ప్రారంభించారు. పోటీల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పోటీలకు కోచ్ మేనేజర్లుగా రాహుల్, హేమంత్ వ్యవహరిస్తారని రాజా పేర్కొన్నారు.

30న భీమవరంలో రాష్ట్రస్థాయి పోటీలు

కాగా ఇక్కడ విజేతలుగా నిలిచి, త్వరలో ప్రకటించే జిల్లా క్రీడాకారుల బృందం ఈనెల 30వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎం.సుధీర్‌వర్మ, షేక్ అబ్దుల్లా, న్యూట్రిషిన్ కోచ్ ఎల్.నాగరాజు, ఎన్.ఐ.ఎస్ కోచ్ జోగిపాటి వంశీ, పీడీ డి.భవానీ, పీఈటీ, కోచ్‌లు జి.రాహుల్, హేమంత్, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొట్టుకుపోయిన కల్వర్టు



కొట్టుకుపోయిన రహదారి

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా పరిసర ప్రాంత సమీప గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. పొన్నాం, బట్టేరు గ్రామాల వెంబడి కొన్ని రోజుల క్రితం ఇసుక లారీలు ఇదే రహదారిపై రాత్రింబవళ్లు తిరిగేవి. దీంతో ఉన్న రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో పాటు పాత కల్వర్టు వర్షాలకు గండి కొట్టేసింది. దీంతో బట్టేరు, పొన్నాం, నవనంబాడు, గొల్లపేట, నక్కపేట, గేదేలవానిపేట గ్రామాల్లోని ప్రజలంతా శ్రీకాకుళం రావడానికి నానా అవస్థలు పడుతున్నారు. చేసేదేమీ లేకపోవడంతో ఆమదావలస మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆయా గ్రామాలకు ఇబ్బందులు లేకుండా మరలా కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. కానీ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండగా కల్వర్టు పనులు నాసిరకంగానే జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చేసిన పనుల్లో నాణ్యత లోపించడం, సిమెంట్, ఇసుక, కాంక్రీటు సైతం వర్షంలోనే తడిసి ధారలా కాలువల్లోకి కొట్టుకుపోతుండడం గమనార్హం. అందువలన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యవేక్షణ చేస్తున్నాం

నైరా మీదుగా కడుతున్న కల్వర్టు పనులను పర్యవేక్షిస్తున్నాం. ఆయా గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరితగతిన కల్వర్టు బ్రిడ్జి నిర్మాణ పనులు చేసి అందిస్తాం.

– రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఏఈ

ఇబ్బందులు పడుతున్నాం



ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నైరా మీదుగా పొన్నాం, బట్టేరు తదితర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి మిల్లు జంక్షన్ వారు ఏర్పాటు చేసుకున్న వే బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాం.

– అప్పారావు, నైరా గ్రామం

నాణ్యత లోపంగానే పనులు



ప్రస్తుతం జోరుగా కురుస్తున్న వర్షంలో చేస్తున్న పనుల్లో నాణ్యత లోపించడం స్పష్టంగా కనిపిస్తోంది. వర్షాలకు బలం ఇచ్చే పరిస్థితి కల్వర్టు శ్లాబ్‌లో కనిపించడం లేదు. పెద్దపెద్ద వాహనాలు వీటి మీద ప్రయాణిస్తే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం కనిపించడం లేదు.

– ఓటుపల్లి కృష్ణ, నైరా గ్రామం



వేబ్రిడ్జి మీద నుంచి రాకపోకలు సాగిస్తున్న దృశ్యం



నిర్మాణంలో ఉన్న కల్వర్టు